క్లుప్తంగా

ఆర్డీవోకు ఫిర్యాదు

సంతబొమ్మాళి: మండలంలోని దండుగోపాలపురం జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తికి శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నేతలు ఇసుక, ఇటుక, చిప్స్ వంటి ఇంటి నిర్మాణ మెటీరియల్స్‌ను ట్రాక్టర్ ద్వారా తరలించుకుపోయారని తెలిపారు. దీనికి రెవెన్యూ, పోలీసు అధికారులు సహకరించారని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి


యువతతో మాట్లాడుతున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

సోంపేట: పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని బారువ ఎస్‌ఐ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని కొర్లాం గ్రామంలో మత్తు వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ యువత ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, గంజాయికి అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయితో దొరికితే 10 నుంచి 15 సంవత్సరాలు జైలులో ఉండాల్సిన పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. మత్తుకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

షాపు ఏర్పాటుపై ఫిర్యాదు


పాఠశాల ప్రహరీకి అనుకుని ఏర్పాటు చేస్తున్న షాపు

టెక్కలి రూరల్: మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీకి అనుకొని నూతనంగా ఒక షాపు ఏర్పాటు చేస్తుండడంతో హెచ్‌ఎం సత్తారు వేణికుమారి అడ్డుకున్నారు. అయినప్పటికీ సదరు వ్యక్తులు వినిపించుకోకపోవడంతో టెక్కలి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పాఠశాల ప్రహరీకి అనుకుని పాన్‌షాపు ఏర్పాటు చేయడం వలన నిషేధిత పదార్థాలు అమ్మితే విద్యార్థులకు నష్టం కలుగుతుందని వాపోయారు. అలాగే షాపులోని చెత్తచెదారం సైతం పాఠశాల ఆవరణలోకి చేరుతుందన్నారు. ప్రస్తుతం షాపు ఏర్పాటు చేస్తున్న స్థలంలో విద్యార్థులు సైకిళ్లు నిలుపుదల చేస్తున్నారని, అందువలన షాపు తొలగించే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏఈవోగా వాసవి


నందిగాం: మండలంలోని లఖిదాసుపురం సచివాలయంలో వ్యవసాయశాఖ గ్రామ వ్యవసాయ సహాయకురాలు(వీఏఏ)గా పనిచేస్తున్న ప్రగడ వాసవి వ్యవసాయశాఖలోనే విస్తరణాధికారిగా (ఏఈఓ)పదోన్నతి పొందింది. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఆమె నందిగాం ఏఈఓగా శనివారం బాధ్యతలు తీసుకున్నారు. గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థలో భాగంగా వీఏఏగా పని చేసిన వాసవి కొద్దిరోజుల్లోనే పదోన్నతి పొందడంపై సహచరులు ఆనందం వ్యక్తం చేశారు.

108 సిబ్బంది నిరసన


నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో 108 సిబ్బంది శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 108 అత్యవసర అంబులెన్స్ సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్నటువంటి జీవో నంబర్ ఎంఎస్ 49ను పునరుద్ధరించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తమ్మినాన పాపినాయుడుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నెయ్యిల గణపతి, 108 సిబ్బంది పాసాల సత్యం, వెంకటరావు, తారకేశ్వరరావు, మోహనరావు, రాజేష్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న జిల్లా జడ్జి జునైద్ మహ్మద్ అబ్దుల్లా తదితరులు

కాశీబుగ్గ: పలాసలో నూతనంగా నిర్మించాల్సిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు శ్రీకాకుళం జిల్లా జడ్జి జునైద్ మహ్మద్ అబ్దుల్లా శనివారం స్థల పరిశీలన చేశారు. గతంలో శంకుస్థాపన కార్యక్రమం పూర్తైనా, నిర్మాణం జరగకుండా నిలిచిపోయిన పరిస్థితులపై ఆరా తీశారు. కార్యక్రమంలో పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి, సీఐ దాడి మోహన్‌రావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల్లా..!

- మూలకు చేరిన కియోస్క్ యంత్రాలు
- పట్టించుకోని ప్రభుత్వం
- రైతులకు సకాలంలో అందని సేవలు

సోంపేట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. దీనిలో భాగంగా రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పి రైతు వద్దకే అన్ని రకాలు సేవలు అందజేసింది. వాటిలో కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రాయితీతో సరఫరా అయ్యేవి. అయితే ప్రస్తుతం అవి మూలకు చేరడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందలేదు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో రైతు సేవా కేంద్రాలకు గత ప్రభుత్వం 81 కియోస్క్ మెషిన్లు అందజేసింది.

ప్రయోజనాలు

రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి అనే నినాదంలో రైతు భరోసా కేంద్రాల్లో కియోస్కా యంత్రాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. దీని ద్వారా రైతు భరోసా కేంద్రంలో రైతులకు చేకూరే ప్రయోజనాలు ఆన్‌లైన్ చేసేవారు. విత్తనాలు, ఎరువులు కోసం రైతులు ముందస్తుగా నగదు చెల్లించేవారు. మధ్యవర్తి ప్రమేయం లేకుండా నేరుగా రైతులు తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆన్‌లైన్ చేసే అవకాశం కియోస్క్ యంత్రంలో ఉంది. ఫలితంగా రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందేవి. వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పుల ముందస్తు సమాచారం సైతం రైతు భరోసా కేంద్రానికి అందేవి. దాని ఆధారంగా సిబ్బంది రైతులను అప్రమత్తం చేసేవారు. రైతులు ఏ పంట వేయాలన్నా సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. కానీ ఈ యంత్రాలు నేడు నిరుపయోగంగా మారాయి.

పేరు మారింది.. సేవలు నిలిచాయి

ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. సేవా కేంద్రాలుగా పేరుకే మారాయి కానీ రైతుకు సేవలు అందజేయడంలో విఫలం అయ్యాయని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక లోపంతో కియోస్కా యంత్రాలు పని చేయడం లేదు. కొన్నిచోట్ల పూర్తిగా వీటిని విస్మరించడంతో మూలకు చేరాయి. ఈ రబీ సీజన్ నుంచైనా వీటిని వాడకంలోకి తీసుకొచ్చి ప్రజాధనం నిరుపయోగంగా మారకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

సేవలు అందజేయాలి



ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రైతు సేవా కేంద్రాలు ద్వారా సేవలు అందజేయాలి. వ్యవసాయ యాప్‌లు గురించి అవగాహన కల్పించి, మారుతున్న కాలానికి అనుగుణంగా దిగుబడులు పెంచేందుకు అవగాహన కల్పించాలి. కియోస్క్ మెషిన్లు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావడంతో పాటు, సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందజేయాలి. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో ఎరువులు అందక ఇబ్బందులు పడ్డారు.

– తెప్పల కోదండరావు, గొల్లగండి గ్రామం, సోంపేట

వినియోగంలో ఉన్నాయి

నాలుగు మండలాల్లో కియోస్క్ యంత్రాలు వినియోగంలో ఉన్నాయి. ప్రస్తుతం రైతులకు ఎటువంటి ఇబ్బందుల కలగకుండా ఎరువులు, విత్తనాలు వ్యవసాయ సిబ్బంది అందజేయడం జరుగుతోంది. రైతుల సౌలభ్యం కోసం సెల్‌ఫోన్ యాప్ ద్వారా సేవలు అందజేయడం జరుగుతుంది. రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు కియోస్క్ యంత్రాలు వినియోగిస్తున్నాం. ఏ సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్నా వినియోగంలోకి తీసుకురావడం జరుగుతుంది.

– కె.జగన్మోహనరావు, వ్యవసాయ సహాయ సంచాలకుడు, సోంపేట

వేలాడుతున్న విద్యుత్ తీగలు



టెక్కలి – మెళియాపుట్టి రోడ్డులోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ విద్యుత్ లైట్లుకి సంబంధించిన విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆదమరిచి ఎవరైనా తాకితే ప్రమాదానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైర్లను సరి చేయాలని కోరుతున్నారు.

– టెక్కలి రూరల్

పేరుకుపోయిన చెత్త



వజ్రపుకొత్తూరు మండలంలోని పల్లివూరు పంచాయతీ హుకుంపేట తీరప్రాంత గ్రామంలో చెత్త పేరుకుపోయింది. గ్రామంలోకి ప్రవేశించగానే చెత్త స్వాగతం పలుకుతోంది. మరో పక్క చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద రోడ్డుకు ఆనుకుని పెద్ద ఎత్తున చెత్త ఉన్నా శుభ్రం చేసే నాథుడే లేడు. దీంతో గ్రామంలో దోమల ఉధృతి పెరిగిపోయిందని, డెంగీ, మలేరియా లాంటి జ్వరాలు వస్తే ఎవరు బాధ్యత తీసుకుంటారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి దృష్టి సారించకపోవడం వల్లే సమస్య తలెత్తుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

– వజ్రపుకొత్తూరు

ఓటుహక్కుపై అవగాహన



భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 7వ వార్డు చినబాడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఎన్నికల వ్యవస్థపై అవగాహన పెంచేందుకు పాఠశాలలో ఎన్నికలను శనివారం నిర్వహించారు. విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు.

– కాశీబుగ్గ

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ సూచించారు. శనివారం రాత్రి తిప్పనపుట్టుగలో గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారినపడి జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తుండడంతో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారన్నారు. అలాగే సైబర్ నేరాలపై సైతం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు తరచుగా గ్రామాల్లో కనిపిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. గృహ హింసపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

టెక్కలి రూరల్: విద్యార్థులు మాదకద్రవ్యాల వైపు వెళ్లకూడదని టెక్కలి ఎస్‌ఐ రఘునాథరావు సూచించారు. మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాలు వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య 410


మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఓటర్ల జాబితాని ప్రదర్శిస్తున్న ఎలక్షన్ డీటీ శ్రీహరి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు మొత్తం 410 మంది ఉన్నారని ఎలక్షన్ డీటీ శ్రీహరి తెలిపారు. నియోజకవర్గంలో నాలుగు ఎంపీడీవో, మండల తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్, మండలాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి శనివారం ప్రచురించారు. ఓటర్లలో 295 మంది పురుషులు, 115 మంది స్త్రీలున్నారని పేర్కొన్నారు. జాబితాపై అభ్యంతరాలుంటే డిసెంబర్ 9వ తేదీలోపు సంబంధిత తహసీల్దార్ కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


కాశీబుగ్గ: మాట్లాడుతున్న సీఐ మోహన్‌రావు


ఇచ్ఛాపురం: అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రబీన్‌కుమార్ పాఢీ

ఇచ్ఛాపురం: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.రబీన్‌కుమార్‌పాఢీ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింక్‌లను క్లిక్ చేయవద్దని, సోషల్ మీడియాపై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు సీతయ్యరెడ్డి, కృష్ణమూర్తి, రాంబాబు, కళాశాల అధ్యాపక సిబ్బంది శ్రీనివాసరావు, దుర్యోధన, సంతోష్‌కుమార్, శివకుమార్, దేవరాజు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, సోషల్ మీడియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ డి.మోహన్‌రావు మాట్లాడుతూ యువత సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఇటీవల ప్రమాదానికి గురైన మెకానిక్ కార్మికుడు చింతాడ నిరంజన్‌ను తోటి కార్మికులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా గాయపడిన నిరంజన్‌కు సిద్ధి విఘ్నేశ్వర మెకానిక్ సంక్షేమ సంఘం పలాస తరుపున రూ.16 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్, అధ్యక్షుడు బేవర చిన్నబాడు, బోయన రాజు, పన్నీరు భాను సైన రంగా, హేమకుమార్, డొక్కర రాజారావు, పులారి దుర్యోధన, మల్లా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లులో కల్తీ పదార్థాలు కలపరాదు


కల్లుగీత కార్మికులతో మాట్లాడుతున్న సీఐ బేబి

సోంపేట: కల్లుగీత కార్మికులు తాము విక్రయించే కల్లులో ఎటువంటి కల్తీ పదార్థాలను కలపరాదని ఎక్సైజ్ సీఐ కె.బేబీ స్పష్టం చేశారు. సర్కిల్ పరిధిలోని కల్లుగీత కార్మికులతో తన కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. కల్లులో కల్తీ జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

బెల్లంఊట ధ్వంసం

సర్కిల్ పరిధిలోని కొండలోగం గ్రామంలో శనివారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించి 1000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం సీఐ కె.బేబి తెలిపారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. దాడుల్లో ఎస్.ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


మహిళ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి మాధురి

వజ్రపుకొత్తూరు/వజ్రపుకొత్తూరు రూరల్: మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై ప్రతీ ఒక్క మహిళ అవగాహన కలిగి ఉండాలని పలాస సివిల్ కోర్టు న్యాయమూర్తి మాధురి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ మహిళ కమిషన్, జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ అధ్వర్యంలో మహిళ న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ, వారి హక్కుల సాధన కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని మహిళలు ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న అంశంపై లఘు చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. అలాగే ఉచిత న్యాయ సలహాలు కోసం టోల్ ఫ్రీ నంబర్ 15100, అలాగే ఫిర్యాదు అందించేందుకు వన్ స్టాప్ సెంటర్ 181ను సంప్రదించాలని సూచించారు. అనంతరం మహిళలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎం.వెంకట అప్పారావు, సీఐ తిరుపతిరావు, తహసీల్దార్ సీతారామయ్య, ఎస్‌ఐ నిహార్, ఎంపీడీవో రమేష్ నాయుడు, హరిప్రియ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో చైన్ స్నాచింగ్

కంచిలి: మండలంలోని తలతంపర గ్రామ సమీపంలో సూదిపుట్టుగ కూడలి వద్ద మహిళ మెడలో రెండు తులాల పుస్తెలు తాడును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లిన ఘటన శనివారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళ్తే.. కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన పురియా మానస తన కుమారుడుతో కలిసి కన్నవారింటికి వరక గ్రామానికి శనివారం ఉదయం వచ్చింది. అక్కడి నుంచి తల్లితో కలిసి సోంపేట పట్టణానికి మార్కెటింగ్‌కు వెళ్లింది. తన హోండా యాక్టివాపై సోంపేటలో మార్కెటింగ్ పూర్తిచేసి, మధ్యాహ్నం తిరిగి తన కన్నవారింటికి వరక గ్రామానికి వస్తుండగా, అదే మార్గంలో వెనుక నుంచి మోటారు సైకిల్‌పై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో ఉన్నటువంటి 2 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లిపోయాడు. ఏం జరిగిందో తెలుసుకునేలోపే సదరు గుర్తు తెలియని వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఆమె కంచిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్థానిక ఎస్‌ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరోచోట విఫలయత్నం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వ వార్డు రోటరీనగర్‌లో దుకాణం వద్ద చైన్ స్నాచింగ్‌కు ఒక దుండగుడు విఫలయత్నం చేశాడు. స్థానికంగా సంతోష్ పాన్‌షాపులో ఉన్న అతని తల్లి మెడలో పుస్తెలు తాడును దుండగుడు తెంచే ప్రయత్నం చేశాడు. అయితే సదరు మహిళ అతనికి విడిచిపెట్టకుండా కేకలు వేయడంతో ఒక్కసారిగా పుస్తెలు తాడు వదిలి పారిపోయాడు. తక్షణమే కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించగా వారు గాలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సీఐ మోహన్‌రావు తెలిపారు

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో తిరుమలరావు

కంచిలి: మండలంలోని కొల్లూరు గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో వి.తిరుమలరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారుల హాజరు, ఇస్తున్న ఆహారం, నాణ్యత, సరఫరా చేస్తున్న ఆహారం, నిల్వలు పరిశీలించారు. అదేవిధంగా స్వచ్ఛ భారత్ నిధులు రూ.36 వేలతో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణాన్ని, పనుల నాణ్యతను గమనించారు. ఆయనతో పాటు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ తారక్, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.వెంకటరావు ఉన్నారు.

కృష్ణారావు మాస్టర్‌కు అభినందనలు


మాస్టర్‌ను అభినందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బైపల్లి గ్రామానికి చెందిన దున్న పుష్పలత పోగొట్టుకున్న 3 తులాల బంగారు అభరణాన్ని బాధితులకు అందించి నిజాయితీ చాటుకున్న మామిడిపల్లి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు ఎస్.వి.కృష్ణారావును ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మాజీ సర్పంచ్ డి.రమేష్ శనివారం అభినందనలు తెలిపారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు ఆచరణలో ఆదర్శవంతంగా నిలిచారని కొనియాడారు. అభినందనలు తెలియజేసినవారిలో యూటీఎఫ్ నాయకులు ఎల్.వెంకటచలం, కె.జయరాం, కె.రమేష్ తదితరులు ఉన్నారు.

ధాన్యం విక్రయాలపై అవగాహన


ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న ఏవో భార్గవి


సోంపేట: అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ అప్పలస్వామి

సోంపేట: ధాన్యం విక్రయాలపై రైతులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ పూడి కూర్మారావు, శిక్షకులు సిమోనా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: రైతుల వద్ద ప్రభుత్వం సూచించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి టి.భార్గవి అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి ధాన్యం కొనుగోలుపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీపీసీఎస్, రైతు సేవా కేంద్రాల వద్ద కొనుగోలు చేసే సమయంలో తేమ శాతం, రవాణా చార్జీలు, డేటా ఎంట్రీలపై వ్యవసాయ సహాయకులకు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి కె.సంతోష్, ఏఎస్‌వో గణపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి


సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కంచిలి: మఠం సరియాపల్లి పీహెచ్‌సీ అభివృద్ధికి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అంతా కలిసి కృషి చేస్తామని కమిటీ అధ్యక్షుడు, స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మఠం సరియాపల్లి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం ఆస్పత్రి ఆవరణలో శనివారం జరిగింది. దీనిలో భాగంగా ఆస్పత్రి పరిశుభ్రత, నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలు, అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. అందుకు అవసరమైన తీర్మానాలు చేశారు. సమావేశంలో ఎంపీడీవో వి.తిరుమలరావు, సర్పంచ్ కొణపల సురేష్, ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ హర్షిత పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పరిశీలన

కంచిలి: మండలంలోని కొల్లూరు పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనుల నాణ్యతను ఎంపీడీవో వి.తిరుమలరావు శనివారం పరిశీలించారు. ఆయన కొల్లూరు గ్రామంలో రూ.6 లక్షలతో, అరవ సరియాపల్లి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న రోడ్ల నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. నిర్మాణదారులకు పలు సూచనలిచ్చారు.